



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ ఎ.సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత తదితరులు

అభివృద్ధికి నోచని 'ఆర్‌యు'



- నిత్యం వివాదాలకు కేంద్ర బిందువుగా..
- భర్తీకి నోచని టీచింగ్ పోస్టులు
- ఊసే లేని రీసెర్చ్ విద్య
- అన్యాక్రాంతం దిశగా విశ్వవిద్యాలయ భూములు
- నేడు ఆర్‌యూ స్నాతకోత్సవానికి గవర్నర్ రాక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి బాటలు పడడం లేదు. ఈ విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఇప్పటివరకు టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టులు భర్తీకి నోచుకోకపోవడం దుర్మార్గం. విశ్వవిద్యాలయ భూములు ఆక్రమణకు గురి కావడంతో రోజురోజుకు కరిగిపోతున్నాయి.

రాయలసీమ విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవ వేడుకలకు ఛాన్సలర్ హోదాలో గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ నేడు హాజరవుతున్నారు. వాస్తవానికి ఈ విశ్వవిద్యాలయం గతంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా సెంటర్‌గా ఉండేది. 1978లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంకు అనుబంధంగా ఇక్కడ పీజీ సెంటర్ ఏర్పాటు చేశారు. అప్పటి నుండి విద్యార్థి సంఘాల విశ్వవిద్యాలయం కోసం పోరాటం చేయడంతో 2008లో రాయలసీమ విశ్వవిద్యాలయంగా అవతరించింది. ఈ విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించడంలో చిన్న చూపు చూస్తోంది. ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిధులను కేటాయిస్తే ఉన్నత విద్య అభివృద్ధికి దోహదపడిపనట్లు అవుతుంది.

రీసర్చ్ కే దిక్కు లేదు..

రాయలసీమ విశ్వవిద్యాలయంలో దాదాపుగా 118 పైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి అనుమతించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో కేవలం ఆరుగురు ప్రొఫెసర్లు మాత్రమే పని చేస్తున్నారు. అందులో ముగ్గురు ప్రొఫెసర్లు వివాదాల్లో ఇరుక్కున్న పరిస్థితి నెలకొంది. విశ్వవిద్యాలయం ఏర్పడి దాదాపుగా 17 సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఒక్క ప్రొఫెసర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం మూలంగా ఇక్కడ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. అలాగే రీసెర్చ్ విద్య కూడా లేకపోవడం మూలంగా విద్యార్థులు విశ్వవిద్యాలయం వైపు వచ్చేందుకు మొగ్గు చూపడం లేదు.

అవినీతి అక్రమాలు ఎన్నో..

ప్రధానంగా విశ్వవిద్యాలయంలో అవినీతి అక్రమాలపై సిబి సిఐడి లాంటి సంస్థ కూడా విచారణ చేపట్టింది. ఇక్కడ ఉన్న ప్రొఫెసర్లపై కూడా అవినీతి అక్రమల ఆరోపణలు ఉన్నాయి. గతంలో వర్సిటీ నిర్మాణ పనులలో అవినీతి చోటు చేసుకుంది. ఇప్పటికే సిబిసిఐడి సంస్థ కూడా విచారణ చేసి రాష్ట్ర ఉన్నత విద్యాధికారులకు నివేదించారు. అలాగే నాన్ టీచింగ్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించి కొంతమంది నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందారు. ఇటువంటి అవినీతి అక్రమాలు విశ్వవిద్యాలయంలో నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమాలకు చెక్ పెడితే విశ్వవిద్యాలయం అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు అవకాశం ఉంది.

అన్యాక్రాంతం దిశగా విశ్వవిద్యాలయ భూములు

విశ్వవిద్యాలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం దిశగా మారిపోతున్నాయి. ఈ విశ్వవిద్యాలయానికి పసుపుల, తాండ్రపాడు గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపుగా 263 ఎకరాల భూమి ఉండేది. ఇప్పుడు విశ్వవిద్యాలయానికి కేవలం 110 ఎకరాల భూమి మాత్రమే ఉంది. దాదాపుగా 150 ఎకరాలకు పైగా విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూమిని ఇప్పటికే రాజకీయ నాయకులు, రియల్టర్లు కలిసి ఆక్రమించుకున్నారు. ఆక్రమించుకున్న భూమి ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం కోట్లలోనే పలుకుతుంది. విశ్వవిద్యాలయ భూములను కాపాడుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు.

టీచింగ్ ఫ్యాకల్టీని వెంటనే నియమించాలి



రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇప్పటివరకు రెగ్యులర్ టీచింగ్ ఫ్యాకల్టీ లేకపోవడం బాధాకరం. ఈ విశ్వవిద్యాలయంతో పాటు ఏర్పడిన యోగి వేమన విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ టీచింగ్ ఫ్యాకల్టీ నియమించారు. కానీ ఇక్కడ నియమించడం లేదు. గతంలో ఎయిడెడ్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా కొన్ని విశ్వవిద్యాలయాలకు కేటాయించారు. అలాంటి వారిని ఇక్కడికి కూడా కేటాయించాలి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలి.

- మన్సూర్ రెహమాన్, కర్నూలు జిల్లా మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిధులను కేటాయించాలి



విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను కేటాయించాలి. రెగ్యులర్ టీచింగ్ ఫ్యాకల్టీ నియామకాల పట్ల దృష్టి సారించాలి. విశ్వవిద్యాలయంలో నెలకొన్న అవినీతి అక్రమాలను నిలువరించాలి. విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పరిష్కరించాలి.

- రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్.

నేడు కర్నూలులో రాష్ట్ర గవర్నర్ పర్యటన

రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ బుధవారం కర్నూల్ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నేరుగా గన్నవరం విమానాశ్రయం నుండి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 10:30 గంటలకు ఓర్వకల్ విమానాశ్రయం నుండి నేరుగా రాయలసీమ విశ్వవిద్యాలయానికి రోడ్డు మార్గాన్న బయలుదేరి వెళ్తారు. ఉదయం 11 గంటల నుండి రాయలసీమ విశ్వవిద్యాలయంలో జరిగే నాలుగవ స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు రాయలసీమ విశ్వవిద్యాలయం నుండి నేరుగా గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఇండస్ పాఠశాలకు చేరుకొని మధ్యాహ్నం అక్కడే భోజనం చేస్తారు. అనంతరం కర్నూలు నగరంలోని ఏ క్యాంపు మాంటిస్సోరి పాఠశాలల్లో జరిగే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు రోడ్డు మార్గంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్తారు.

5 వేల మందికి ఉపాధి అవకాశాలు


- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- రిలయన్స్ పరిశ్రమకు వర్చువల్ విధానంలో సిఎం చంద్రబాబు శంకు స్థాపన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా దాదాపుగా 5 వేల మంది ఉపాధి అవకాశాలు పొందుతారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ పరిశ్రమకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పానీయాల ఉత్పత్తి యూనిట్ మెక్సికో తర్వాత రెండవ అతిపెద్ద యూనిట్‌గా నిలవనుందన్నారు. ఈ యూనిట్‌ను రిలయన్స్ సంస్థ రూ.3 వేల కోట్ల పెట్టుబడితో నిర్మిస్తోందన్నారు. 5 నెలల్లో పనులు పూర్తి చేస్తున్నారన్నారు. ఈ సంస్థ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇక్కడే స్కిల్ సెంటర్‌లు కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఓర్వకల్లులో రెడ్‌జోన్ కింద క్రియేట్ చేశారని, కెమికల్ ప్లాంట్స్ ఇండస్ట్రీస్ వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఓర్వకల్లులో రూ.23 వేల కోట్లతో సెమీ కండక్టర్ పరిశ్రమకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే రూ.7 వేల కోట్ల విలువగల అగస్త్య సోలార్ పనులు జరుగుతున్నాయన్నారు.. జిల్లా కలెక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 6 ప్రాజెక్టులు, 3 ఎంఎస్ఎంఈ పార్కులు ముఖ్యమంత్రి సమక్షంలో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఓర్వకల్లు మండలాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా చేసి ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి, రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రోడక్ట్ లిమిటెడ్ పబ్లిక్ అఫైర్స్, కమ్యూనికేషన్ వైస్ ప్రెసిడెంట్ అర్పన్ బసు, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్ కిషన్, పారిశ్రామిక వేత్త సుబ్బారెడ్డి, కమ్యూనికేషన్ సౌత్ దామోదర్ రావు, టిడిపి మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, సిఎస్ సుధాకర్ రెడ్డి ,మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు : మంత్రి కె.అచ్చెన్నాయుడు

కర్నూలు ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కర్నూలు ఎయిర్ పోర్ట్‌లో ఏర్పాటు చేస్తున్న ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌ను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మెల్‌స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎపి ఎయిర్‌పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు కానున్న ఈ సంస్థ ద్వారా వాణిజ్య, ప్రైవేట్ పైలట్‌లకు కమర్షియల్ పైలట్ లైసెన్స్, ప్రైవేట్ పైలట్ లైసెన్స్ , మల్టీ ఇంజన్ రేటింగ్, ఇన్స్ట్రుమెంట్ రేటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుందన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎపి ఎయిర్‌పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, మెల్‌స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ కశ్యప్, సెట్కూరు సీఈఓ డా.వేణు గోపాల్, కర్నూలు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, డిఐఓ ప్రవీణ్ రెడ్డి, డీఈ అమత్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కె.అచ్చెన్నాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

17, 18న పత్తికొండ మండలంలో జీపు జాతా

- 20న మహాధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ మండలంలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 17, 18వ తేదీల్లో జీపు జాతా కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. మండలంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న ఆర్‌డిఒ కార్యాలయం ముందు తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో సిపిఎం జనరల్ బాడీ సమావేశం దస్తగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా హెూసూరు గ్రామం దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేయాలన్నారు. మద్దికెర మండలం బురుజుల గ్రామం దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేసి పత్తికొండ, మద్దికెర గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో సిసి రోడ్లు, మంచినీటి సమస్య ఉందన్నారు. పత్తికొండ పట్టణంలో రోడ్ల విస్తరణ అమలుకు నోచుకోడం లేదన్నారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17, 18వ తేదీలలో జీపు జాతా కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో సమస్యలు అధ్యయనం చేసి ఈ నెల 20వ తేదీన జరిగే ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు రంగారెడ్డి, గోపాలు, సిఐటియు సెక్రెటరీ ఎం.రవిచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న, భూజులు, పిఎన్ఎం నాయకులు కాశి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విష్ణువర్ధన్, డివైఎఫ్ఐ నాయకులు దుగ్గెన్న, జయప్రకాశ్ రెడ్డి, అల్లిపీర, హమాలీ వర్కర్స్ నాయకులు చంద్ర, హుస్సేన్, మహిళ మండలి అధ్యక్షురాలు కృష్ణవేణి, ఐకెపి అధ్యక్షులు పురుషోత్తం, సిఐటియు మద్దికెర సెక్రెటరీ రాముడు, ఆటో వర్కర్స్ నాయకులు అక్బర్, రైతు సంఘం నాయకులు కారప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

సాగునీరు, స్థానిక సమస్యలపై పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - పత్తికొండ

సాగు, తాగునీటి సమస్యలు, స్థానిక సమస్యల పరిష్కారానికి సిపిఎం నిర్వహించే పోరాటాలకు మద్దతు ఇవ్వాలని, తుగ్గలి మండలంలో ఈనెల 18, 19వ తేదీల్లో నిర్వహించే జీపుజాతాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. మంగళవారం తుగ్గలిలోని పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు రంగస్వామి అధ్యక్షత వహించారు. ఆనంద్ బాబు, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, మండల నాయకులు భాస్కర్ రెడ్డి, కొండారెడ్డి, రంగరాజు మాట్లాడారు. మండలంలో ఉన్న 13 చెరువులను హంద్రీనీవా ద్వారా నింపి, పంట కాలువలను తీయించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం ముందు చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మండల నాయకులు రామాంజనేయులు, గంగాధర్, ప్రజాసంఘాల నాయకులు వెంకట రాముడు, పెద్ద ఆంజినయ్య, గంగాపతి, కె.వెంకటరాముడు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

- కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీహర్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష తెలిపారు. మంగళవారం కర్నూలులోని బళ్లారి చౌరస్తాలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీహర్ష ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దినేష్ ఆయనకు శాలువా వేసి సన్మానించారు. గోశాల కమిటీ మాజీ సభ్యులు శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి రఘునందన్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు శ్రీరాములు, కర్నూలు ప్రగతి సమితి నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, ప్రేమ్, భార్గవ్, వెంకట్, సునీల్, నాగరాజ్ పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న సభ్యులు

అవిశ్వాసానికి అంతా సిద్ధం..!

- క్షేత్రస్థాయిలో ఎంపిటిసిల సమీకరణ
- ఆర్‌డిఒకు టిడిపి ఎంపిటిసిల లేఖ
- అవిశ్వాసం అప్రజాస్వామికమంటున్న వైసిపి

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు మండలంలో రాజకీయం వేడెక్కుతోంది. మండలంలో ఎంపిపి పీఠం చుట్టూ రాజకీయం కేంద్రీకృతమైంది. ఇదివరకే ఆ పీఠాన్ని అనుభవిస్తున్న వైసిపి ఆ అధికారాన్ని ఎలా కాపాడుకోవాలని ప్రయత్నిస్తుండగా, మరోవైపు ఆ పీఠాన్ని ఎలాగోలా చేజిక్కించుకోవాలని అధికార టిడిపి ముమ్మర ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా టిడిపి తన లక్ష్యాన్ని చేరుకోవడం కోసం వేగంగా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఎంపిపి పీఠంపై వైసిపి ఉండడంతో అధికార పార్టీ పనులను నెరవేర్చుకోవడానికి వైసిపి అడ్డుగోడగా మారింది. టిడిపి అధికారంలో ఉన్నా మండల పరిషత్‌లో తగిన మెజార్టీ లేకపోవడంతో అధికార పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన ప్రతిపాదనలు వీగిపోయే పరిస్థితి వారికి ఎదురవుతూ వస్తోంది. పైగా చట్టంలోని నిబంధనలు ఎంపిపిగా ఎన్నికైన తర్వాత నాలుగేళ్ల వరకు అవిశ్వాసం కూడా అవకాశం లేకుండా పోయింది. ఇటీవలే ఆ గడువు తీరడంతో టిడిపి తమ ఆశయం నెగ్గించుకోవడం కోసం రాజకీయ చదరంగాన్ని ప్రారంభించింది. నానా గడ్డి కరిచి అధికార బలంతో మండలంలో ఎంపిటిసిలను సమీకరించుకునే దిశగా టిడిపి నియోజకవర్గ ముఖ్య నేతలు వైసిపి ఎంపిటిసిలకు టచ్‌లోకి వెళ్లి, సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంపిటిసిలకు పార్టీలో వివిధ ప్రయోజనాలతో పాటు, రాజకీయ హామీలను ఇచ్చి వారిని ప్రసన్నం చేసుకున్నట్లు తెలిసింది.

అవిశ్వాసానికి అంతా సిద్ధం..?

కర్నూలు మండలంలో మొత్తం 23 ఎంపిటిసి స్థానాలు ఉండగా అందులో పసుపుల ఎంపిటిసి-1 స్థానంలో ఉన్న మురళీకృష్ణ అకాల మరణానికి గురయ్యారు. పంచలింగాల ఎంపిటిసిగా ఎన్నికైన బస్తిపాటి నాగరాజు ఎంపీగా ఎన్నిక కావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఆర్.కొంతలపాడు ఎంపిటిసిగా ఉన్న గిడ్డమ్మ సుంకేసుల సర్పంచిగా ఎన్నికవ్వడంతో ఆ స్థానం ఖాళీ అయింది. సింగవరం ఎంపిటిసిగా ఎన్నికైన సవారన్న మృతి చెందారు. మొత్తంగా నాలుగు ఎంపిటిసి స్థానాలు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం 19 ఎంపిటిసిలు ఉన్నారు. అవిశ్వాసం ప్రవేశపెట్టాలంటే కనీసం ఎంపిటిసిలు 2/3 వంతు మెజారిటీ టిడిపి చూపించాల్సి ఉంటుంది. ఇప్పటికే టిడిపి జిల్లా సీనియర్ నాయకులు, కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు సమన్వయంగా ఎంపిటిసిల సమీకరణకు పావులు కదిపారు. ఈ మేరకు 13 మంది ఎంపిటిసిలను సమీకరించారు. అందులో భాగంగా వారు ఎంపిటిసిలతో కలిసి ఈనెల 9న ఆర్‌డిఒను కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని, సమావేశం నిర్వహించాలని కోరుతూ లేఖను సమర్పించిన విషయం తెలిసిందే. నేడో.. రేపో అవిశ్వాసం ప్రక్రియలో భాగంగా ఆర్‌డిఒ ఓటింగ్ నిర్వహించే అవకాశం మెండుగా ఉంది. టిడిపి నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తోందని వైసిపి నాయకులు మండిపడుతున్నారు. గతంలో వైసిపి అధికారం లో ఉన్న నేపథ్యంలో ఎంపిటిసిల నామినేషన్లను కూడా వేయించకుండా నిరంకుశంగా వ్యవహరించిందని టిడిపి నాయకులు ప్రత్యారోపణ చేస్తున్నారు. ప్రజాస్వామ్యవాదులు అధికార పార్టీ వైఖరిని తప్పు పడుతున్నారు. మండలంలో రాజకీయ పరిణామం ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.

డిసెంబర్ 2న మండల సర్వసభ్య సమావేశం

డిసెంబర్ 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ ఎంపిటిసిలకు నోటీసులు పంపారు. వాస్తవంగా ఎన్నికలు జరిగినప్పుడు మొత్తం 23 మంది సభ్యులకు గాను టిడిపి 8, వైసిపి 15 స్థానాల్లో గెలిచారు. టిడిపి అధికార బలంతో ప్రస్తుతం ఎంపిటిసిలను లొంగ దీసుకున్నారు.



ఆర్‌డిఒకు లెటర్ ఇస్తున్న టిడిపి ఎంపిటిసిలు

స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన సర్జరీ

- ఎముకల క్యాన్సర్ సర్జరీ విజయవంతం
- వైద్యుల బృందాన్ని అభినందించిన స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఎముకల క్యాన్సర్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. కదిరికి చెందిన ఎన్.శాంతమ్మ ఎడమ తొడ కింద భాగంలో వాపు, నొప్పితో బాధపడుతూ అక్టోబర్ 15న క్యాన్సర్ హాస్పిటల్‌లో చేరారు. ఎముకల క్యాన్సర్ విభాగానికి చెందిన వైద్యులు డాక్టర్ బ్రహ్మ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ శివ కృష్ణ ఆధ్వర్యంలో అన్ని పరీక్షలూ చేసి కండ్రోసర్కోమా అనే ఎముకల క్యాన్సర్‌గా నిర్ధారించారు. క్యాన్సర్ పైభాగం వరకు కాలు తీసి వేయకుండా క్యాన్సర్ ఉన్న ఎముక, కండరాలను మాత్రమే తీసేసి కృత్రిమ ఎముక (మెగా ప్రొస్తెసిస్) వేసి కాలును కాపాడారు. సర్జరీ తర్వాత కూడా అన్ని పనులు చేసుకోగలిగేలా సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. సర్జరీ సమయంలో కానీ, తర్వాత కానీ ఎటువంటి ఇబ్బంది రాకుండా సరైన జాగ్రత్తలు తీసుకొని, వాకర్ సహాయంతో రోగిని నడిపించారు. ఈనెల 10న రోగిని డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. సర్జరీ ఇక్కడ మొదటిది కావడం గమనార్హం. డిశ్చార్జ్ సమయంలో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సిఎస్‌కె.ప్రకాష్ రోగితో మాట్లాడి సర్జరీ విజయవంతం చేసిన వైద్యుల బృందం ఆర్థోపెడిక్, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీసియా, పాథాలజీ వైద్యులు డాక్టర్ చైతన్య వాణి, డాక్టర్ బీసన్న, డాక్టర్ భారతి, డాక్టర్ వరలక్ష్మి వైద్యులను అభినందించారు.



ఎముకల క్యాన్సర్ సర్జరీని నిర్వహించిన బృందంతో డైరెక్టర్ ప్రకాష్

నిమోనియా గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఎ.సిరి ఆద్వర్యంలో నిమోనియా గోడపత్రికను ఆవిష్కరించారు. జాతీయ ఎస్ఎఎన్ఎస్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈనెల 12 నుంచి 28 వరకు గ్రామస్థాయిలో ఆశా, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, క్షేత్రస్థాయి సిబ్బంది కమ్యూనిటీ నిమోనియాపై అవగాహన కల్పిస్తారు. ఐదేళ్లలోపు పిల్లల్లో నిమోనియా లక్షణాలు, కలిగే ప్రమాదాలు, నివారణ మార్గాలు, వ్యాధినిరోధక టీకాలు వేయడం, వాతావరణ కాలుష్యం, పొగ రహిత పొయ్యిలు వాడకం, సరైన గాలి, వెలుతురూ అందుబాటులో ఉండడం మొదలైన వాటి గురించి గృహ దర్శనాల్లో తెలియజేస్తారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ బాస్కర్, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ ఉమా, డెమో ప్రకాష్ రాజ్, హెచ్‌ఇఒ బాబా ఫక్రుద్దీన్, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిరి



నివాళులర్పిస్తున్న మన్సూర్ రెహమాన్, ఆవాజ్ నాయకులు

విద్యా సంస్కరణలకు కలాం కృషి

- ఆవాజ్ ఆధ్వర్యంలో మైనారిటీ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యా సంస్కరణలకు విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అర్థశాస్త్ర విశ్రాంత అధ్యాపకులు ఎస్.మన్సూర్ రెహమాన్ తెలిపారు. మంగళవారం మైనారిటీ దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎమ్‌డి.షరీఫ్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా 'మైనారిటీ దినోత్సవ' సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మన్సూర్ రెహమాన్, ఆవాజ్ నగర అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్ హాజరయి మాట్లాడారు. బారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా భారత ప్రభుత్వం విద్యారంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ భారతరత్న బిరుదు ఇచ్చి సత్కరించిందని తెలిపారు. అనంతరం తెలుగు పండిట్ నిసార్ అహ్మద్ మాట్లాడారు. ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ నయీం, పాత బస్తీ సీనియర్ నాయకులు డి.పార్వతయ్య, మహబూబ్ బాష,షేక్షావలీ, షేక్ నూర్ వలీ, ఆవాజ్ ట్రెజరరీ ఇలియాస్, ఆవాజ్ నగర నాయకులు చాంద్ బాషా, అబ్దుల్ సత్తార్, జుబేర్, యూనిస్, హర్షద్, అవేజ్ బాష, బాషా బాయ్ పాల్గొన్నారు. **కోడుమూరు** పట్టణంలోని సంత మార్కెట్‌లో గల ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ముస్లిం, మైనారిటీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మైనారిటీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ వసంతలక్ష్మీబాయి హాజరయ్యారు. ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇంతియాజ్ బాషా, క్రీసెంట్ స్కూల్ కరస్పాండెంట్ ఖాజా హుస్సేన్, అబ్దుల్ అజీమ్ హాజరయ్యారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ షాకీర్ అధ్యక్షత వహించారు. మతపెద్దలు అస్లాంబాష, ఉర్దూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బీ, నాయకులు మున్నా పాల్గొన్నారు.

చీని సాగులో మెళకువలు పాటించండి

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

చీని సాగులో మెళకువలు పాటించాలని అంబుడ్స్ మేన్ డాక్టర్ సురేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం క్రిష్ణగిరి, బాపనదొడ్డి, కంబాలపాడు, కోయిలకొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. చీని పంటలు సాగు చేస్తున్న రైతుల తోటలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ... చీని పంటలను సాగు చేస్తూ రైతులు మరింత ఆదాయం పెంచుకోవచ్చన్నారు. ఈ పంటల సాగులో రైతులకు యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపైనా, మార్కెటింగ్ విషయాలపైనా సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏపీవో నాగ సులోచన, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, మహేంద్ర, శ్రీనివాస్, క్రిష్ణగిరి ఫీల్డ్ అసిస్టెంట్ రిజ్వాన పాల్గొన్నారు.



ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్న స్కావెంజర్లు

స్కావెంజర్లపై రాజకీయ వేధింపులు తగదు

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి - ఆలూరు

చాలీచాలని వేతనాలతో కొన్నేళ్లుగా పాఠశాలల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల శుభ్రం చేస్తున్న నిరుపేద స్కావెంజర్లను రాజకీయ వేధింపులతో తొలగించడం తగదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెవి.నారాయణ స్వామి తెలిపారు. మంగళవారం కరిడిగుడ్డం, పెద్దహోతూరు గ్రామంలో తొలగించిన స్కావెంజర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి, షాకీర్ మాట్లాడారు. నిరుపేద మహిళలు కుటుంబాన్ని పోషించుకునేందుకు తక్కువ వేతనంతో పని చేసిన కార్మికులను నేడు పొమ్మనడం అధికార పార్టీకి తగదన్నారు. పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయని, వచ్చిన ప్రతి పార్టీ తొలగిస్తామని వేధింపులు పాల్పడితే అన్ని కార్మిక సంఘాలతో కార్యాలయాలను, నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఇఒ కోమలదేవికి వినతిపత్రం అందజేశారు. ఐద్వా నాయకులు షేషన్ బీ, రత్నమ్మ, గౌసియాబీ, స్కావెంజర్ రంగమ్మ, సిద్దమ్మ, రూప, సక్కు బాయి, హేమావతి, మంగమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి : సిఐ


ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ అశోక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

క్రమశిక్షణతో, నైతిక విలువలతో చదువుకున్న ప్రతి విద్యార్థీ నేటి ప్రపంచంలో మేధావిగా వికసిస్తారని సిఐ అశోక్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం మరియు ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో భారతరత్న, స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐ అశోక్ కుమార్ హాజరయి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులదే కీలక పాత్ర అని, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసిస్తే ప్రతి విద్యార్థీ మేధావి అవుతారని సూచించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, వీర నారీమణులు, సంఘ సంస్కర్తల వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐ అశోక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. 150 మీటర్ల జాతీయ జెండాను తీసుకుని పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టారు. చిన్నా పెద్ద తేడా లేకుండా చిన్నారుల వేషధారణలు, ర్యాలీ చూపరులను ఆకట్టుకుంది. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకులు భీమేష్, రాజు, జయలక్ష్మి, ఉపాధ్యాయులు ఈరన్న, శీను, శిరీష, రామలక్ష్మి, ముంతాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు దుద్ది విద్యార్థులు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని దుద్ది గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయ్యస్వామి, పీడీ వడ్డే లక్ష్మి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషయమన్నారు. గ్రామానికి చెందిన విద్యార్థి నరసింహులు పులివెందులలో జరిగిన అండర్-16 కబడ్డీ పోటీల్లో ఎన్నికై ఇప్పటికే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని, ఖోఖో పోటీల్లో లల్లి, రాఘవేంద్ర ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, పీడీని ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల చివరి వారంలో అనకాపల్లిలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు నారాయణ, నాగలక్ష్మి, లక్ష్మీ కాంత్ రెడ్డి, సునీత, రామాంజనేయులు, పుష్పవతి, రమేష్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యారంగ సమస్యలపై పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మల్లేష్, వీరేష్

ప్రజాశక్తి -ఆలూరు

విద్యారంగం సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభలు ఆలూరులోని డిసెంబర్ 4, 5వ తేదీల్లో నిర్వహిస్తున్న సందర్భంగా మంగళవారం ఆలూరు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా అధ్యక్షతన ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మల్లేష్, గురునాథ్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వీరేష్, మేనేజర్ వీరేష్, ఎస్కె.గిరి, జె.వీరేష్, జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంత ఆలూరులో ఉపాధి లేక తల్లిదండ్రులు వలస వెళ్తుండడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నా పాలకులకు, ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. 50వ జిల్లా మహాసభలు ఈ ఉద్యమ చరిత్రను మరింత బలపరిచే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు కెపి.నారాయణ స్వామి, పి.హనుమంతు, సోము, చంద్రబాబు, తిక్కస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ రాష్ట్ర నాయకులు సంయుక్త, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు షాకీర్, కృష్ణ, గోవర్ధన్, మండల నాయకులు ఉమేష్ చంద్ర, సురేష్, శ్రీరాములు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు

పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం

- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి జ్యోతి

ప్రజాశక్తి - దేవనకొండ

పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి మండలాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఈదుల దేవరబండ గ్రామంలో ఎంఎస్ఎంఇ పార్కుకు రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన 'పరిశ్రమలతో ఉపాధి కల్పన' వర్చువల్ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రూ.17 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఇ పార్కులో ఉపాధి కల్పన భవనాలు నిర్మించి, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో పరిశ్రమ అభివృద్ధి చెందుతుందా... లేదా అనే అపోహలు ఎవరూ పెట్టుకోవద్దన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని తెలిపారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ సుదర్శన్, ఎంపిడిఒ జ్యోతి, వెలుగు ఎపిఎం లక్ష్మన్న, విఆర్‌ఒ సూరి, ఆలూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ రంగడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, సుభాన్, ఉద్దీరప్ప, మల్లయ్య, రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, మాలిక్, రాజాసాబ్, ముని రంగడు, వెలమకూరు, చెల్లెల చెలిమల, బేతపల్లి సర్పంచులు భాస్కర్, చిన్న రామప్ప, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

చంద్రబాబుతోనే గ్రామాలాభివృద్ధి

- టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలి, టిడిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్, భాస్కర్

ప్రజాశక్తి - చిప్పగిరి

అనుభవం గల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలి, టిడిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్, భాస్కర్ తెలిపారు. మంగళవారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో వాటర్ ట్యాంకు దగ్గర నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు రూ.10 లక్షలతో చేపట్టే సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రాధాన్యత ఉన్న పనులను చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిరుపేదలకు అండగా ఆర్థిక చేయూత అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. రంగనాథ్, నెట్టెకల్లు, సూరిబాబు, గోవిందు, తిమ్మప్ప, రామాంజనేయులు, కురువ రామాంజి పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

విద్యార్థికి రాష్ట్రస్థాయి రజత పతకం

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సిద్ధార్థ్ అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పీడీలు జాకీర్ హుస్సేన్, ఆంజనేయులు, కులుమాల పీడీ శివ, పాఠశాల సిబ్బంది సిద్ధార్థ్‌ను అభినందించారు. విద్యార్థి క్రీడా ప్రతిభను మెచ్చుకున్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. సిద్ధార్థ్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మంత్రాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠంతో పాటు పరిసరాల్లో బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో పలు చోట్ల తనిఖీలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట సమీపంలో బాంబు బ్లాస్టింగ్ జరిగి 13 మంది మృతి చెందిన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసు శాఖ, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. శ్రీమఠంలోని కారిడార్, పుష్కరిణి, రాఘవేంద్ర సర్కిల్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనంతరం మండలంలోని తుంగభద్ర గ్రామంలోని రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. పోలీసు రంగస్వామి పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న ట్రైయినీ కలెక్టర్లు

దేవరగట్టును సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండలానికి విచ్చేసిన ట్రెయినీ కలెక్టర్లు శివాని, శివం సింగ్, మైఖేల్, నిధియా, ఆల్ఫ్రెడ్, శివనేందరన్ బృందం మంగళవారం శ్రీమాళమల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీరిని దేవరగట్టు ఛైర్మన్ వీర నాగప్ప, కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించి, ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామిని దర్శించుకుని మూలవిరాట్‌కు అభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. దేవరగట్టు బన్నీ ఉత్సవ విశేషాలు, ఆలయ చరిత్రను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి తమవంతుగా రూ.5,021 విరాళంగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు దేవరగట్టు చిత్ర పటాన్ని గుర్తుగా బహుకరించారు. పంచాయతీ కార్యదర్శులు రంగస్వామి, మహ్మద్ షఫీ, కోగిలతోట నాగరాజు, గజ్జెహళ్లి నాగరాజు పాల్గొన్నారు.

చిప్పగిరిలో పారిశుధ్య పనులు

- 'పడకేసిన పారిశుధ్యం' వార్తకు స్పందించిన అధికారులు


చెత్త కుప్పలను జెసిబి ద్వారా తొలగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. గత శనివారం ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన 'పడకేసిన పారిశుధ్యం' వార్తకు అధికారులు స్పందించి మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తకుప్పలను జెసిబి ద్వారా తొలగించినట్లు, కాలువల్లో పేరుకుపోయిన ఒండ్రు మట్టిని పారిశుధ్య కార్మికులతో తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రమీల తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి

- ఎంపిడిఒ రాముడు

ప్రజాశక్తి -కోడుమూరు


ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ ఎసి.రాముడు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కోడుమూరు పంచాయతీ దాసరి వీధిలో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ ఐవిఆర్ఎస్ కాల్స్ ప్రజలు ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అనే అంశంపై పర్యవేక్షణ చేసి అవగాహన కల్పించారు. రోజూ ప్రతి గ్రీన్ అంబాసిడర్, శానిటేషన్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని చెప్పారు.

టెక్నాలజీకి మారు పేరు చంద్రబాబు

- ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, పార్థసారథి

ప్రజాశక్తి - మంత్రాలయం

టెక్నాలజీకి మారు పేరు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యేలు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి, పార్థసారథి తెలిపారు. మంగళవారం స్థానిక అబోడే (శ్రీనివాస స్టార్) హోటల్ విస్తరణలో భాగంగా ఇల్టన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ వారు ప్రభుత్వం నుంచి మంజూరైన సుమారు రూ.97 కోట్లతో నిర్మించ తలపెట్టిన టూరిజం భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంతో ప్రారంభించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జీ లక్ష్మన్న హాజరయ్యారు. హోటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఊహా చిత్రం రూపురేఖలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూనే ఉపాధి కల్పన కోసం ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త కావాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. మంత్రాలయంలో భక్తుల సౌకర్యార్థం ఇంటర్నేషనల్‌కు చెందిన ఇల్టన్ గ్రూప్ ఆధ్వర్యంలో 120 గదులతో త్రీస్టార్ హోటల్ నిర్మించి సుమారు 300 మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా చేపట్టినట్లు చెప్పారు. టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. నియోజకవర్గంలో సిసి రోడ్ల ఏర్పాటుకు గ్రామాల్లో ఉన్న వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు సంతకాలు పెట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబోడే హోటల్ ఎండి ఆర్ఎస్.కార్తీక్, డిప్యూటీ జనరల్ మేనేజర్ తివారీ, మేనేజర్ రజనీకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహశీల్దార్ కె.రమాదేవి, ఎంపిడిఒ నూర్జహాన్, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.


ఊహాచిత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- లైబ్రేరియన్ ఆశాజ్యోతి

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలోని గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కె.ఆశాజ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. ఈనెల 14న గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి బాలల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథ్, పాతూరి నాగభూషణంను స్మరించే కార్యక్రమం ఉంటుందన్నారు. 17, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు ఉంటుందన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే

- డాక్టర్ సువర్ణ లక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



నిమోనియా ఒక సాధారణమైనదే అయినా.. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తుందని మెడికవర్ హాస్పిటల్స్ శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ సువర్ణ లక్ష్మి కల్లి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. వ్యాక్సిన్ తీసుకోవడం, శ్వాసకోశ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం, మొదటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. నిమోనియాపై అవగాహన పెంపొందించడం అంటే కేవలం రోగాన్ని నివారించడం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి శ్వాస ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా అని చెప్పారు. ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునే సంకల్పంతో ముందుకు సాగుదామని కోరారు.

అంగన్వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- పీడీ విజయ

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసిడిఎస్ పీడీ విజయ సూచించారు. మంగళవారం నాగలాపురం అంగన్వాడీ కేంద్రంలో అస్వస్థతకు గురయిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు సుదర్శన్, వైష్ణవి ఆరోగ్య పరిస్థితిని ఎపి బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజినేయులుతో కలిసి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, ప్రత్యేక చొరవ తీసుకుని ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టిఎన్ఎస్ఎఫ్ నియోజక వర్గ అధ్యక్షులు బెస్త జయ సూర్య, ఉపాధ్యక్షులు నూర్, కార్యనిర్వాహక కార్యదర్శి మహేష్, మండల ఉపాధ్యక్షులు శేఖర్, కార్యదర్శి రఘు పాల్గొన్నారు.


విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న పీడీ

చిన్నారులకు సిపిఎం పరామర్శ : ఆదోని మండలం నాగలాపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఆహార పదార్థాలు తిని అస్వస్థకు గురయి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను సిపిఎం నాయకులు పరామర్శించారు. చిన్నారులు కోలుకుంటున్నారని, ఎలాంటి ప్రాణాపాయమూ లేదని వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. నాయకులు లక్ష్మన్న, గోపాల్, తిప్పన్న, వీరారెడ్డి, వీరేష్, వెంకటేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


చిన్నారులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పరామర్శ : నియోజకవర్గంలోని నాగలాపురం గ్రామంలో అస్వస్థతకు గురయి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న చిన్నారులను ఎమ్మెల్యే పార్థసారథి పరామర్శించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం తల్లిదండ్రులకు భరోసా ఇస్తూ, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల పరిసర ప్రాంతాలతో పాటు, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

భూసార పరీక్ష పత్రాలు పంపిణీ : ఎఒ

ప్రజాశక్తి - సిబెళగల్

భూసార పరీక్షల అనంతరం ఫలితాల పత్రాలను ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేయడంతో పాటు ఎరువులు, మందుల వాడకం వంటివి ఉపయోగించాలని పేర్కొన్నారు. అలాగే పంటల సస్య రక్షణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదని, 80 టన్నులు సిద్ధంగా ఉందని చెప్పారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపిపి దేశాయి లక్ష్మీదేవి అధ్యక్షతన, డిప్యూటీ ఎంపిడిఒ రవి కిషోర్ ఆధ్వర్యంలో సమావేశం కొనసాగింది. సమావేశానికి కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. రెవెన్యూ శాఖాధికారు లు గైర్హాజరు కావడంతో ఆ విభాగానికి సంబంధించిన సమస్యలపై చర్చ జరగలేదు. మండలాభివృద్ధి, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ స్థాయిలో సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో చర్చలు జరగగా, కొన్ని గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సమస్యలు, విద్యుత్ అంతరాయాలు వంటి అంశాలను సభ్యులు ప్రస్తావించారు. అధికారులు వీటిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి లక్ష్మీదేవి సూచించారు. ఇకపై జరగబోయే సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలంటూ ఆమె సూచించారు. జడ్‌పిటిసి సుంకన్న, సింగిల్ విండో ఛైర్మన్ రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు : వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రస్తుత సీజన్‌లో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. మంగళవారం మండలంలోని పుట్టపాశం, తిప్పనూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలు వివరించారు. ఎమ్మిగనూరు ఎడిఎ ఎస్.మహ్మద్ ఖాద్రీ కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణ చర్యలు వివరించారు. గోనెగండ్ల ఎఒ హేమలత పప్పు శనగ పంటలో విత్తన శుద్ధి గురించి వివరించారు. శాస్త్రవేత్త సతీష్ వేరుశనగలో సస్య రక్షణ చర్యల గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పులిరాజు, అరుణ, గ్రామ వ్యవసాయ సహాయకులు తస్లీమ్, రఘు, రైతులు కౌలుట్ల, ఎలీసా, రామకృష్ణ పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని కోల్మాన్ పేట గ్రామంలో ఎఒ ఎం.వరప్రసాద్ 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్ తరపున బయో రిసోర్స్ సెంటర్ నిర్వహించే కోల్మాన్ పేట గ్రామ రైతు వై.రామాంజనేయులు సహజ పద్ధతుల ద్వారా తయారు చేసుకునే వేపగింజల కషాయం, కోడిగుడ్లతో తయారు చేసే ఎగ్ అమినో యాసిడ్, చేపలతో తయారు చేసే ఫిష్ అమినోయాసిడ్, ద్రవ జీవామృతం, పుల్లటి మజ్జిగ తదితర కషాయాలు తయారు చేసుకునే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కషాయాలు పిచికారి చేసిన వెంకటరెడ్డి, ఆంజనేయులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే పంట పొలాలను సందర్శించి వారి సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. హనుమంతు, ఆంజనేయులు, మధు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : ఎరువులు, పురుగుమందుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలని ఎఒ ఎం.శివశంకర్ తెలిపారు. మండలంలోని ఏనుగుబాల, దైవందిన్నె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు భూమాత రక్షణ కమిటీ గురించి వివరించారు. రైతులు విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల భూమి, వాతావరణం కాలుష్యం చోటు చేసుకుంటుందని తెలిపారు. ఎఇఒలు నరసింహ, వినోద్, రసూల్ పాల్గొన్నారు.




గోనెగండ్లలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు



కోసిగి



అవగాహన కల్పిస్తున్న ఎఒ శివశంకర్


సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

- వైసిపి నాయకులు ప్రతాప్ రాజేష్ కుమార్ శెట్టి

ప్రజాశక్తి - నందవరం

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వైసిపి నాగలదిన్నె నాయకులు ప్రతాప్ రాజేష్ కుమార్ శెట్టి తెలిపారు. మంగళవారం నాగలదిన్నె గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... ప్రయివేటీకరణ జరిగితే మెడికల్ సీట్ల ఫీజులు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించే అవకాశం ఉండదని చెప్పారు. నాగప్ప, బి.ఈరన్న, కె.రాము, జె.రామాంజనేయులు, వీరేష్, ఎస్సీ రంగన్న, హుస్సేని గౌడ్, కోటేకల్ చంద్, కాకి చిన్న ఆదెన్న, టి.సిద్ధప్ప పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేద్దాం : ఈనెల 12న ఎమ్మిగనూరులో నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేద్దామని రాజేష్ కుమార్ శెట్టి కోరారు. వైసిపి ఇన్‌ఛార్జీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయులకు సర్వీసు పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులో నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ ఎస్‌టియు సర్వీసు పుస్తకాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఎస్‌టియు రాష్ట్ర నాయకులు బి.నాగరాజు మాట్లాడుతూ... దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను నూతన ఉపాధ్యాయులకు వివరించారు. ఎస్‌టియు జిల్లా నాయకులు సురేంద్ర, నేమకల్ నాగరాజు, మండల అధ్యక్షులు మల్లేష్, మండల సిపిఎస్ కన్వీనర్ కృష్ణ, రాజేంద్ర, విమల్ తేజ్, రామాంజనేయులు, రామకృష్ణ, హనుమంతప్ప, మద్దిలేటి బాబు, నాగార్జున పాల్గొన్నారు.

13న కూరగాయల మార్కెట్ వేలం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ పంచాయతీ కూరగాయల మార్కెట్ వేలం పాటలు ఈనెల 13న పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రఫీ మంగళవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.2 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించాలన్నారు. పంచాయతీకి ఎలాంటి బకాయిలూ ఉండరాదన్నారు.